వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 04 సెప్టెంబర్ 2022


## నాలుగు రోడ్ల కూడలిలో వైభవంగా సామూహిక కుంకుమార్చన



**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 03 ప్రభాతవార్త :**

పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవాలలో భాగంగా నాల్గవ రోజు వేద పండితుల ఆధ్వర్యంలో విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం గణనాధునికి సామూహిక కుంకుమార్చన పలువురు మహిళల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు కె.వి.సుబ్బారావు, సగళా సురేష్ బాబు, దొంతంశెట్టి కిషోర్, సముద్రాల విజయ్ కుమార్, సురేష్, దర్శి సుమన్, పైడిమర్రి సురేష్, మల్లి, మస్తాన్ రాజా, దొంతంశెట్టి జయకుమార్, వైభవ్ ప్రసాద్‌తో పాటు పలువురు కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

## వినాయక స్వామిని దర్శించుకున్న మున్సిపల్ ఛైర్మెన్



**బద్వేలు అర్బన్, సెప్టెంబరు 03 ప్రభాతవార్త :**

మున్సిపాలిటీ పరిధిలోని వినాయక నగర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన వినాయక స్వామిని శనివారం మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి, రూరల్ వైసీపీ సీనియర్ నాయకులు బిజివేముల రామసుబ్బా రెడ్డితో పాటు పలువురు నాయకులు దర్శించుకున్నారు. వారికి వార్డు ఇన్‌ఛార్జ్ 24వ వార్డు ఇన్‌ఛార్జ్ రాగిమాను ప్రతాప్ కుమార్, కౌన్సిలర్ రాగిమాను రవితేజాతో పాటు పలువురు ఉత్సవ కమిటీ సభ్యులు పలువురు వారికి ప్రత్యేకంగా స్వాగతం పలికి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, శాలువా, పూలమాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ రకాల ఆకులతో, కూరగాయలతో, బొమ్మలతో భక్తులను ఆకట్టుకునే విధంగా తోటోత్సవ కార్యక్రమం నిర్వహించారు. వినాయక నగర్‌లో ఏర్పాటుచేసిన ఉత్సవాల పట్ల ఛైర్మెన్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపెంట వెంకట సుబ్బయ్య, సుప్ర శ్రీకర్, యల్లారెడ్డి, బచ్చు సుధాకర్, గోల్డ్ షాపు ఈశ్వరయ్య, శ్రీనివాసులు, నారాయణ, నరసింహ, ప్రభాకర్‌తో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

# విద్యకు పేదరికం అడ్డుకాదు

## రాష్ట్ర హైకోర్టు జడ్జి, కడప అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్

## ఇష్టపడి చదివి ఉన్నత స్థానాను ఆదిరోహించాలి : కలెక్టర్ విజయ్ రామరాజు





**కడప, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :**

విద్యకు పేదరికం అడ్డుకాదు. కష్టంతో కాక ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని రాష్ట్ర హై కోర్ట్ జడ్జి, కడప అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంయుక్తంగా పిలుపునిచ్చారు. శనివారం రాత్రి వై ఎస్ ఆర్ ఆడిటోరియం ఎదురుగా ఉన్న ఎస్.సి బాలుర వసతి గృహం నెంబర్ 3, మరియాపురం సమీపంలో ఉన్న ఎస్.సి కాలేజీ బాలికల వసతి గృహాలను... జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. సోలమన్ రాజు గారు, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ శ్రీమతి ఎస్. కవిత..లతో కలసి వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. .. ముందుగా వారు ఆయా వసతి గృహాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర హై కోర్ట్ జడ్జి, కడప అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ.. భోజనం బాగుందా ? దుప్పట్లు ఇచ్చారా.? బాత్రూములు సరిపడా ఉన్నాయా ? దిన పత్రికలు చదివే అల వాటు ఉందా? అని విద్యార్థి, విద్యార్థినులను అడిగారు. అన్నీ వసతులు బాగున్నాయి. దిన పత్రికలు ఉదయం ప్రార్థనా సమయంలో చదివిస్తారని వారు చెప్పారు. విద్యకు పేదరికం అడ్డుకాదని, ప్రతి విద్యార్థి బాగా చదివి ఉన్నత స్థానాలను అధిరోహించి తల్లిదండ్రులు, గురువులు గర్వించే విధంగా ఎదగాలన్నారు. తాను కూడా చిన్నప్పటి నుండి ప్రభుత్వ హాస్టల్ లోనే చదివానన్నారు. విద్య ఉంటే ఆస్తిపాస్తులు సంపాదించుకోవచ్చునన్నారు. ఈ రోజు మీ వద్దకు జడ్జి గా, కలెక్టర్ గా వచ్చామంటే మేము.. బాగా చదువుకోవడం వల్లనే అని అన్నారు. మీరు కూడా బాగా చదివి మీరు ఎంచుకున్న రంగంలో లక్ష్యాన్ని సాధించాలన్నారు. సమస్యలుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రావాలన్నారు. జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ.. విద్యకు ఉన్న విలువ దేనికి లేదన్నారు. విద్యను ఎవరు దొంగలించలేరని తెలిపారు. బాగా చదువుకుని స్వంత ఊరికి, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మరొక్కసారి తాను ఈ హాస్టల్స్ కు వస్తానని సమస్యలు ఏమైనా ఉంటే చెబితే పరిష్కరిస్తామన్నారు. అనంతరం రాష్ట్ర హై కోర్ట్ జడ్జి, కడప అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ విద్యార్థి, విద్యార్థులకు తన సతీమణి తో కలసి స్వీట్స్, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్, ఆర్డీవో ధర్మచంద్రా రెడ్డి, ఈడీ ఎస్ ఈ కార్పొరేషన్, ఇంచార్జి జేడీ సోషల్ వెల్ఫేర్ వెంకట సుబ్బయ్య, ఏ ఎస్ డబ్లు లు, వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు రుణ యాప్‌లకు దూరంగా ఉండండి

### ఎస్పీ హర్షవర్ధన్ రాజు



**రాయచోటి, సెప్టెంబర్ 3ప్రభాతవార్త:**

అన్నమయ్య జిల్లా ప్రజలు రుణ యాప్‌లకు దూరండా ఉండాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ప్రజలను కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సైబర్ మోసాలు గురించి, సులువుగా తొందరగా రుణాలు ఇస్తున్నారన్న కారణంతో వ్యక్తులు, వ్యాపారస్తులు ఈ రుణ యాప్‌లకు ఆకర్షితులవుతున్నారని, తీరా రుణాలు తీసుకున్నాక అధిక వడ్డీ, వివిధ అసంబంధమైన ఛార్జీల పేరిట యాప్ నిర్వహకులు రుణ గ్రహీతల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూళ్ళకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు రుణాలు తిరిగి చెల్లించే విషయంలో యాప్ నిర్వహకులు దారుణంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రుణ గ్రహీతల ఫోన్ల నుండి వారి వ్యక్తిగత సమాచారాన్ని సేకరించి దానిని దుర్వినియోగం చేయడం జరుగుతోందని, అదే విధంగా వారి ఫోన్ల నుండి సేకరించిన ఫోటోలను మార్ఫింగ్ చేసి అశ్లీలమైన ఫోటోలు, వీడియోలను వారి ఫోన్‌లోని కాంటాక్ట్ నెంబర్లకు పంపించి వేధించడం జరుగుతుందన్నారు. ఇలాంటి చట్టబద్ధత లేని యాప్స్ నుండి రుణాలు తీసుకుంటే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని, ప్రజలు కేవలం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి గుర్తింపు పొందిన బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీల వద్ద మాత్రమే రుణాలు తీసుకోవాలని ప్రజలను కోరారు. ఎవరైనా రుణాల విషయంలో వేధింపులకు గురి చేస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.


చుక్కల భూమి యజమానుల సమస్యలు పరిష్కరించాలని సిఎంకు వినతి IVలో







## విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ విజయరామరాజు





**కడప, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :**

విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు వైద్యులను హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్ వీసి హాల్లో ఒక చోట పనిచేస్తూ మరొక చోట బయోమెట్రిక్ వేస్తున్న పిహెచ్‌సి వైద్యులతో జేసీ సీ.ఎం.సాయికాంత్ వర్మ తో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంత మంది వైద్యులు పనిచేసే ప్రాంతంలో కాకుండా మరొక చోట బయోమెట్రిక్ వేస్తుండడం తో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మరొక చోట బయోమెట్రిక్ వేస్తున్న వారిని పేరు పేరున పిలిచి మరొక ప్రాంతంలో బయోమెట్రిక్ వేయడానికి కారణాలు అడిగారు. పొంతన లేని సమాధానాలు ఇచ్చిన వాటిని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృత నిచ్చయంతో పని చేస్తుంటే .. కొంత మంది వైద్యులు పనిచేసే ప్రాంతంలో కాకుండా.. మరొక చోట బయోమెట్రిక్ వేయడం సరికాదన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో సమీపంలో ఉన్న పిహెచ్‌సి కేంద్రానికి వస్తే మీరు అందుబాటులో లేకుండా పోతే ఎలా అని వైద్యులపై ఆగ్రహం వెలిబుచ్చారు. ఇకపై పనిచేసే ప్రాంతంలో కాకుండా మరొక చోట బయోమెట్రిక్ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా పరస్పర సమ్మతి బదిలీలు కావాలనుకుంటే వారికి పరస్పర సమ్మతి బదిలీలు (మ్యూచువల్ బదిలీలు) చేస్తామన్నారు. అంతే కాని ప్రజలకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం మూల్యం చెల్లించుకోకతప్పదని అన్నారు. త్వరలో అన్ని పిహెచ్‌సి లలో, అలాగే డాక్టర్ రూము ఎంట్రన్స్ లో కూడా సి.సి కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కంప్యూటర్లు, ఫైబర్ నెట్ కావాలంటే కూడా ఇస్తామన్నారు. పనివేళల్లో వైద్యుల విధులకు అంతరాయం కలుగకుండా ..సాయంత్రం 5 గంటల తరువాతనే సమావేశాలు నిర్వహించాలని డిఎంహెచ్ డా. నాగరాజును ఆదేశించారు. ఈ సమావేశంలో రిమ్స్ సూపర్ ఇన్ టెండెంట్ డా. వెంకటేశ్వర రావు, వైద్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఉత్తమ టీచర్ అవార్డుకు ఎంపికైన పుష్పావతి

### 5న సీఎం జగన్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ



**రాయచోటి, సెప్టెంబర్ 3ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఏటా సెప్టెంబర్ 5న గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులకు అందజేసే రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ల అవార్డుకు ఈ ఏడాది అన్నమయ్య జిల్లావ్యాప్తంగా ఐ. పుష్పావతి ఎంపికయ్యారు. పుష్పావతి జిల్లాలోని కలకడ మండలం నడిమిచెర్ల జడ్పి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పని చేస్తున్నారు. ఈమె 34 గేళ్ల విద్యా బోధన కృషిఫలంగా రాష్ట్రస్థాయి అవార్డు అవకాశం లభించింది. ఈ నెల 5న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును ఆమె అందుకోనున్నారు. 1989 లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన ఈమె ప్రాథమిక పాఠశాల నుంచి ఉన్నత పాఠశాలలో సేవలను అందించారు. యుపి స్కూల్‌ను 2019- 20లో జడ్పీ ఉన్నత పాఠశాలగా ఆప్ గ్రేడ్ చేయించడానికి మండల, జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులతో సొంత ఖర్చులతో సంప్రదించి ఎట్టకేలకు ఉన్నత పాఠశాలగా ఏర్పాటుకు విశేషంగా కృషి చేశారు. ఉన్నత పాఠశాలగా స్కూలును తీర్చిదిద్దడంతో ఆ పాఠశాలను అందరికీ అందు బాటులోనికి తీసుకుని రావడం 2021 - 22 లో టెన్త్ ఫలితాలలో 85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఈమె జనవరి 2021 లో బదిలీపై జడ్పీ హైస్కూల్ నడిమిచెర్ల కు వెళ్లారు. అక్కడ బైలాజికల్ విద్యాబోధన చేస్తూ అక్కడి ప్రధాన ఉపాధ్యాయులు అనారోగ్య సమస్యతో సెలవుపై వెళ్లగా ఆమె ప్రధానో పాధ్యాయులుగా కొన సాగుతున్నారు. అక్కడ కూడా ఆమె బోధించే పా ఠ్యాంశంలో 2021-20 22 లో 100% టెన్త్ లో ఉత్తీర్ణులయ్యారు. ఆమె ఎక్కడ పని చేసినా విద్యార్థులతో స్నేహ భావంతో మమేకం కావడం, ఉపాధ్యాయులతో కలిసి గమ్యం చేరుకునే విధంగా కృషి చేశారు. ప్రధానో పాధ్యాయులు అనే తారతమ్యం లేకుండా అందరితో కలిసి పని చేయడమే ధ్యేయంగా పెట్టుకొని పని చేయడం విద్యార్థుల, వారి తల్లిదండ్రులతో సఖ్యత గా ఉండడం పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. ఆమె భర్త ఓ తెలుగు దినపత్రిక అసోసియేట్ ఎడిటర్‌గా, కుమారుడు హేమంత్ ప్రముఖ సర్జన్ డాక్టర్‌గా, కోడలు డాక్టర్ వి.ప్రియాంక, కుమార్తె డాక్టర్ వి. పోసిన ప్రియాంక, అల్లుడు డాక్టర్ కౌశిక్‌లు ఆమెను ఆదర్శవంతంగా తీసుకొని ప్రజా సేవలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆమెకు అవార్డు దక్క డం పై స్వయంగా పలువురు ఐఏఎస్ లు, ఉన్నతాధి కారులు, ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేశారు. అయితే ఎన్ని ప్రశంసలు వచ్చినా, అవార్డులు వచ్చినా పుష్పావతి సాదాసీదాగా ఉంటారు. ప్రచారాలకు చాలా దూరంగా ఉంటారు.






## మనబడి నాడు - నేడు పనులు వేగవంతం చేయాలి : కలెక్టర్ గిరీష పిఎస్





**రాయచోటి, సెప్టెంబర్ 3ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండవ విడత మనబడి నాడు -నేడు పనులు వేగవంతం చేసి నిర్దేశించిన గడువు లోపల పనులు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శనివారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో రెండవ విడత మనబడి నాడు -నేడు పనుల పురోగతిపై ఎంఈఓ లు, పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 1022 పాఠశాలలు, 21 కళాశాలలో రెండవ దశ మనబడి నాడు నేడు పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. మంజూరైన పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లాలో ఎక్కడెక్కడ అదనపు తరగతి గదులు మంజూరయ్యాయో వాటిని వెంటనే ప్రారంభించాలన్నారు. ఆర్ సి వరకు వచ్చిన ఏసీఆర్ భవన నిర్మాణాలను వెంటనే కంప్లీషన్ చేయాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో జరుగుతున్న మనబడి నాడు నేడు పనులను వేగవంతంగా పూర్తి చేసి అందులో అన్ని వసతులు వుండేటట్లుచూడాలలని డీఈఓ కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు -నేడు పనులు పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు అందరూ సీరియస్ గా తీసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. జిల్లాలో మంజూరైన అదనపు తరగతి గదులు, టాయిలెట్స్ కొన్ని చోట్ల ఇంకా ప్రారంభించలేదని వీటిని వెంటనే ప్రారంభించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యా నాణ్యతా ప్రమాణాలు పెంచడమే నాడు నేడు ప్రధాన ఉద్దేశ్యమని నాడు నేడు కింద ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేయడం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని పనులు నాణ్యతతో చేపట్టాలన్నారు. ప్రతి పాఠశాలలో తప్పకుండా 33% ఎక్స్పెండిచర్ జనరేట్ చేయాలన్నారు. ఇలా చేయడంవల్ల సి ఎఫ్ ఎం ఎస్ కు బిల్స్ మూవ్ అవుతాయన్నారు.

ఎం ఈ ఓ లు, ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజు మనబడి నాడు నేడు పనుల పురోగతిని పర్యవేక్షించాలన్నారు. వీరు ఈ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలు మరియు అంగన్వాడీ కేంద్రాలలో చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాలలో నిర్లక్ష్యం వహించకుండా వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనుల నిర్వహణలో ముఖ్యంగా పాఠశాలలను మరింతగా అభివృద్ధి చేయడం, మౌలిక వసతులు మెరుగుపరచడం, మెయింటెనెన్స్ నిర్వహణ, బోధనలో విద్యా నాణ్యతా ప్రమాణాలు పెంచడం తదితర అంశాలలో సంబంధిత అధికారులు అందరూ నూతన విధానాలతో పనులు పూర్తి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాఘవరెడ్డి, పంచాయితీరాజ్ ఎస్ఇ ప్రసన్న కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## నూతన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన ప్రారంభం



**బద్వేలు లీగల్, సెప్టెంబరు 03 ప్రభాతవార్త :**

రాష్ట్ర గౌరవ హై కోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బట్టు దేవానంద్ శనివారం ఉదయం బద్వేలులో నూతనంగా నిర్మించిన సీనియర్ సివిల్ జడ్జి కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మెన్, జిల్లా జడ్జి, ప్రధాన న్యాయమూర్తి ఎస్.సాల్మన్‌రాజ్, బద్వేలు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి.వి.ఎస్.ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వి.ఆర్.రెడ్డి, వి.ఎస్.రెడ్డి, సెక్రటరి కమ్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఎస్.కవిత, ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జస్టిస్ సి.ఎన్.మూర్తి, ఫోర్త్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి జస్టిస్ గీత, పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్మెన్ జస్టిస్ ఎస్.ప్రసాద్, ప్రిన్సిపల్ సెషన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కృష్ణన్ కుట్టి, బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి, బద్వేలు ఆర్డీవో వెంకట రమణ, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర హై కోర్టు గౌరవ జడ్జి మరియు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బట్టు దేవానంద్ మాట్లాడుతూ 18 సంవత్సరముల తరువాత సీనియర్ సివిల్ జడ్జి కోర్టు బద్వేలు పట్టణంలో ఏర్పాటుకావడం గర్వించదగ్గ విషయమని, ఇందుకు అవసరమైన స్థల సేకరణ కోసం బద్వేలు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు చేసిన కృషి అభినందనీయం అని, ఎన్నో ఏళ్లుగా వారి కల ఈ విధంగా సాకారమైందని, ఈ న్యాయస్థానమును న్యాయవాదులు, కక్షిదారులు సద్వినియోగం చేసుకుని కేసులను సత్వరమే పరిష్కారమయ్యే విధంగా దృష్టి సారించాలని, అనంతరం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాల్మన్‌రాజ్ ప్రసంగిస్తూ 1981 లో ఇక్కడి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుగా ఆవిర్భ వించిందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ వంశీధర్ గౌడ్ మరియు జిల్లాలోని పలు కోర్టుల నుండి వచ్చిన బార్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







## ప్రజల సంతోషాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాల దుష్ప్రచారం

### ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి వేద బడుగు బలహీన మైనారిటీ వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి నేరుగా వారి ఖాతాలలో నగదు జమ చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజల సంతోషాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేయడం తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి హితవు పలికారు. శనివారం సాయంత్రం 35వ వార్డు కౌన్సిలర్ పిట్టా బాలాజీ మహిళా నేత పిట్టా సుభద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేప ట్టిన సంక్షేమ పథకాల లబ్ది తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పేదరికం ప్రామాణికంగా అర్హత గల ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు లబ్ది చేకూరేలా చర్య లు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా తాము బాధ్య తలనుంచి ఎప్పటికీ తప్పించుకోమన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల యింది. ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలోనూ, ఏ పార్టీ కూడా మేనిఫెస్టోను పక్కాగా అమలు చేసిన పరిస్థితి లేదని కేవలం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రమే ప్రతి హా మీని అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి బాబు, వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకులు కాకర్ల నాగ శేషారెడ్డి, 40 వార్డు ఇంచార్జ్ రావులకొల్లు నాగేంద్ర, కౌన్సిలర్లు వంశీధర్ రెడ్డి, ఇర్ఫాన్ భాష బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రసపుత్ర రజని దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగలక్ష్మి నరసింహారావు, డీలర్ రామాంజనేయులు, స్వాకర్ భాస్కర్, వైసిపి నాయకులు ఆచారి కాలనీ శివారెడ్డి, వార్డ్ వాలంటర్లు, సచివాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10 వతేదీన శంకర్ ప్రవచనాలు

ఒంటిమిట్ట సెప్టెంబర్3 ప్రబాతవార్త:

ఈనెల 10 వతేదీన పసుపులేటి శంకర్ కడప జిల్లా సింహాద్రిపురం మండ లంలోని నిడివెలగల శ్రీ ఆంజనేయస్వామి దేవస్ధానం నందు ప్రవచనాలు చేయ నున్నారు. గ్రామ పెద్దలు గ్రామ ప్రజలుభక్తాదులు కలిసి బాగవత భక్త సమాజము వారి నిఆహ్వానించి బాగవత సప్తాహపఠన, శ్రవణ యజజము నిర్వహిస్తున్నరు. ఇందులోబాగంగా ఈ నెల 10 వతేదీన పోతన సాహిత్యపీఠం దర్మాచార్యులు, ఒంటిమిట్ట గ్రామ నివాసి పసుపులేటి శంకర్ ప్రవచనాలు చేయనున్నరు.

## అన్నదానం పవిత్రమైనది : డిఎస్పీ శ్రీధర్



రాయచోటి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

అన్నదానం పవిత్రమైనదని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. రాయచోటి పట్టణంలోని చెక్ పోస్ట్ సమీపంలోని పెట్రోల్ బంకు వెనుక వైపున శనివారం వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి ని డీఎస్పీ శ్రీధర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వినాయక మండపం వద్ద రాయచోటి పట్టణానికి చెందిన ఎంజీ గ్రాండ్ రెస్టారెంట్ నిర్వాహకులు మనోజ్ కుమార్ రెడ్డి, గురుప్రసాద్ రెడ్డి లు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు డీఎస్పీ శ్రీధర్ దంపతులను సన్మానించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు నాగరాజ, చిన్నా, రాజు, దివాకర్ రెడ్డి రామాంజులు రెడ్డి తోపాటు పలువురు పాల్గొన్నారు.

## పెద్దఎత్తున పోటీల్లో పాల్గొన్న మహిళలు

### బహుమతిదారులను ఎంపిక చేసిన ఉమామహేశ్వర్‌రెడ్డి

చిట్వేలి, సెప్టెంబరు 3 ప్రభాతవార్త

వినాయకచవితి వేడుకల్లో భాగంగా అన్నమయ్య జిల్లా చిట్వేలి గ్రామంలో గాజులవీధిలో ఉత్స వ కమిటి సభ్యులు రంగవల్లులు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గాజులవీధిలోని మహిళలు పెద్దఎత్తున పాల్గొని తమకు కేటాయించిన సమయంలో ముగ్గులను వేసి రకరకాల రంగులతో మరింత ఆకర్షణీయమంగా ముగ్గులను తీర్చిదిద్దారు. ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ముగ్గులకు వైసిపి నాయకులు చిట్వేలి గ్రామ ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్‌రెడ్డి పర్యవేక్షించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు ఎంపిక చేశారు. చివరి రోజున బహుమతులు ప్రధానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ముగ్గుల పోటీలు నిర్వహించడంపై మహిళలు సంతృప్తిని వ్యక్తపరిచారు.

## ఉపాధి సిబ్బందికి కేంద్ర జలశక్తి బృందం ప్రసంశలు జల్లు



కలికిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

మండలంలో విదులు నిర్వహిస్తున్న ఉపాధి సిబ్బందికి కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అదికారులు ప్రసంశలు జల్లు కురిపించారు. కలికిరి మండలంలోని సైనిక్‌స్కూల్ లో రూ.28.38 లక్షలతో ఉపాధి పథకంలో నిర్మించిన పనులను కేంద్ర బృందం సందర్శించి పరిశీలించింది. ఆ పనుల సత్ఫలితాలు ఇస్తుండడంతో కేంద్ర బృందం ఉపాధి సిబ్బంది పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ అధికారిని ఉమాదేవి మాట్లాడుతూ ఇదే తరహాలో రైతులకు, కూలీలకు ఉపయోగపడే పనులు చేపట్టాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ద్వామాపీడి మద్దిలేటి, ఏపిడి నందకుమార్‌రెడ్డి, కలికిరి ఏపిఓ సుజాత, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు బట్టలు పంపిణీ



ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

రామేశ్వరం లోని వికాస్ విహార్ మానసిక వికలాంగుల పాఠశాలలో విద్యార్థులకు పసుపుల వెంకటమ్మ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ తరపున బట్టల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ అండ్ చైర్మన్ పసుపుల సుబ్బరాయుడు మాట్లాడుతూ డాక్టర్ వివి లక్ష్మీనారాయణ గారి కుమారుడు యంగ్ అండ్ డైనమిక్ ఐపీఎస్ ఆఫీసర్ సాయి ప్రణీత్ బాబు జన్మదినం సందర్భంగా రామేశ్వరం నందు వికాస్ విహార్ వికలాంగుల పాఠశాల నందు శనివారం మానసిక వికలాంగులు సమక్షంలో కేక్ కట్ చేసి వారిని సంతోష పరచామని, అనంతరం వారికి 50 జతల బట్టలు పంపిణీ చేశారు. స్కూల్ కి వచ్చిన వారికే కాకుండా పాఠశాలకు రానివారికి కూడా బట్టలు అందజేస్తా మనారు.ఇంత గొప్ప కార్యక్రమము మా సంస్థలో నిర్వహించినందుకు మేము చాలా ఆనందిస్తున్నామని మా సంస్థ తరపున ఐపీఎస్ ఆఫీసర్ సాయి ప్రణీత్ బాబు తండ్రిని మించిన తనయుడులా ఎదగాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమానికి స్పాన్సర్‌గా బట్టలు అందజేసిన ఆర్టిపి పి ఏడి లక్ష్మి మునయ్యకి, పాల్గొన్న వారికి సంస్థ తరపున ధన్యవాదాలు తెలిపారు.

## ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు టౌన్‌లో నివసించు యాచకులకు, నిస్సహాయకులకు, సాధువులకు, వృద్దులు కు శనివారం ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో చాపాడు మండలం రాజువారిపేట శ్రీ వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొరపాడు వేణుగోపాల్ రెడ్డి, నారాయణ రెడ్డి, న్యాయవాది సుమంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## భూ రీసర్వే ద్వారా అన్యాక్రాంత భూముల గుర్తింపు



సంబేపల్లి, సెప్టెంబర్ 3ప్రభాతవార్త:

సమగ్ర భూ రీసర్వే ద్వారా అన్యాక్రాంతమైన, దురాక్రమనకు గురైన, ప్రభుత్వ భూములు, రైతులకు సంబంధించిన భూములు గుర్తించవచ్చని డిసిఎంఎస్ మాజీ ఛైర్మెన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుట్టపల్లి గ్రామంలో భూ రీసర్వేకి భూమిపూజ నిర్వహించి డ్రోన్ ద్వారా గ్రామ విస్తీర్ణాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఉపయోగపడే ఇలాంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తమ రికార్డులను తీసుకువెళ్లి సర్వే చేయించుకోవాలన్నారు. రైతులు సహకరిస్తే త్వరితగతిన రెవెన్యూ అధికారులు రీసర్వే పూర్తి చేస్తారన్నారు. గుట్టపల్లి గ్రామ విస్తీర్ణం 1595.45 ఎకరాలని ఈ గ్రామంలో ఆరు పల్లెలు ఉన్నట్లు తెలిపారు. గ్రామంలో మొత్తం 7 జీసిపి పాయింట్లను గుర్తించినట్లు మండల సర్వేయర్ గోపినాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు చిదంబర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పొత్తూరి రవీంద్రనాయుడు, మాజీ సర్పంచ్ పాల వెంకటరమణ, వైసిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, మండల సర్వేయర్ గోపినాథ్, గ్రామ సర్వేయర్లు రెడ్డి శేఖర్, నవ్యశ్రీ, షాహిదా, రైతులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల పక్షాన హామీలు అడిగితే నాపై కేసులా : శివరామ్



మైదుకూరు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

మైదుకూరు మార్కెట్ కూడలి తెదేపా కార్యాలయంలో తెదేపా నేతలతో కలిసి తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్ మాట్లాడుతూ గత నెల ఆగస్ట్ 25 తెదేయిన నిరుద్యోగుల పక్షాన ఎన్నికలకు ముందు వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు వినతి పత్రం ఇచ్చి కలెక్టర్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళని జిల్లా తెదేపా అగ్రనేతలతో పాటు తెలుగుయువత నాయకులు వెళ్ళితే పోలీసులు తెదేపా నేతలతో పాటు నా పైన రెండు కేసులు పెట్టారని ఎఫ్ ఆర్ఐ కాపీని చూపుతూ ప్రభుత్వం పైన నిప్పులు చెరిగారు. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలు మూడేండ్లు గడుస్తున్నా అమలు చేయకుండా మాట తప్పి మడమ తిప్పారని హామీలు ప్రశ్నిస్తే కేసులు పెట్టడం అనైతికమని ప్రభుత్వ దుర్మార్గాన్ని ఎండ గట్టారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్, తెదేపా జిల్లా కార్యదర్శి కొండపేట షరీఫ్, మైదుకూరు పట్టణ మైనారిటీ ప్రధాన కార్యదర్శి అంబారపు షరీఫ్ పాల్గొన్నారు.

## సైంటిఫిక్ టెంపర్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్పై అవగాహన సదస్సు



ప్రొద్దుటూరు అర్బన్, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:

స్థానిక వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, యోగి వేమన యూనివర్సిటీ నందు జనవిజ్ఞాన వేదిక, ప్రొద్దుటూరు వారి సహకారంతో సైంటిఫిక్ టెంపర్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉషారాణి బెహరా, ఏపియస్‌ఎస్సిపి మెంబర్ ఉషారాణి మరియు ఉమెన్ రైట్స్ ప్రొటెక్షన్ లాయర్ మాట్లాడుతూ మూఢనమ్మకాలను సమాజంలో పారద్రోయాలని ఆమె చెప్పారు. దానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం గురించి విద్యార్థినీ, విద్యార్థులకు విపులంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా వైస్ ప్రసిడెంట్ శ్రీరాములు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నాగరాజు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఇపుడున్న కాలానికి అనుగుణంగా ఏ విధంగా విషయ పరిజ్ఞానం పెంపొందించు కోవాలో మరియు దాని ఆవశ్యకతను గురించి చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య నిర్వాహకులు డాక్టర్ ఎస్.కె. షఫీవుల్లాభాషా, డాక్టర్ ఎ.అశోక్ కుమార్ మరియు ఎన్.హరినాధరెడ్డిలు పాల్గొన్నారు.

## ఎన్జీవో కాలనీ వద్ద వినాయకునికి విశేష పూజలు

### అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



బద్వేలు అర్బన్, సెప్టెంబరు 03 ప్రభాతవార్త :

పట్టణంలోని సిద్దవటం రోడ్ ఎన్జీవో కాలనీ వినాయక స్వామి ఉత్స వ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక చతుర్థి ఉత్స వాలలో భాగంగా నాల్గవ రోజు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య వినాయకునికి వివిధ రకాల ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రేలారే రేలా, శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి జీవిత చరిత్రతో పాటు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు. భక్తులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఉత్స వ కమిటీ సభ్యులు బోవిళ్ళ యానాదిరెడ్డి, నాగిరెడ్డి శంకర్ రెడ్డి, పెద్దిరెడ్డి చెన్నకృష్ణా రెడ్డి, నిమ్మకాయల గోపాల్ రెడ్డి, గాజులపల్లె శంకర్ రెడ్డి, అరవ శ్రీనివాసులురెడ్డి, కొత్తూరు మస్తాన్ రెడ్డి, రాజవోలు సుబ్బారెడ్డి, మడియాల సుబ్బయ్య, పాపుదిప్పు కొండారెడ్డి, కత్తెరపల్లె శివరామిరెడ్డి, యూత్ కమిటీ సభ్యులు భూపాల్ రెడ్డి, శివసాయినాథ్ రెడ్డితో పాటు పలువురు కమిటీ సభ్యులు స్వామివారి సన్నిధిలో పలువురికి విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు, ఉత్స వ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా వినాయక చవితి వేడుకలు



బ్రహ్మంగారి మఠం, సెప్టెంబరు 03 ప్రభాతవార్త :

మండలంలోని నరసన్నపల్లె గ్రామంలో వినాయక చవితి వేడుకలను నాల్గవ రోజు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నరసన్నపల్లె గ్రామానికి చెందిన సన్నబోయిన శ్రీనివాసులు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. నాలుగు రోజులుగా గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ శనివారం అన్నదాన కార్యక్రమంతో పాటు, వినాయక స్వామి వద్ద ఉంచిన లడ్డు ప్రసాదం వేలంపాట నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్.ఆర్.శ్రీనివాసులు రెడ్డిని ఘనంగా సన్మానించడంతో పాటు, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం అధిక సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు.

## విశ్రాంత ఉపాధ్యాయులకు ఘన సన్మానం



బ్రహ్మంగారి మఠం, సెప్టెంబరు 03 ప్రభాతవార్త :

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి పేర్కొన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు విశ్రాంత ఉపాధ్యాయులతో పాఠశాలలో సమావేశం ఏర్పాటుచేశారు. అలాగే పాఠశాల అభివృద్ధి కొరకు పాటుపడిన వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి అధ్యక్షత వహించారు. 2009 నుండి 2017 వరకు పనిచేసి రిటైర్డ్ అయిన జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ప్రభలవీడు నరసింహులు, తెలుగు ఉపాధ్యాయుడు ముచ్చర్ల శేషయ్యలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ప్రభలవీడు నరసింహులు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన విద్యార్థిని తిరిగి ఇక్కడే ఉపాధ్యాయులుగా పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 100 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలను 2017 లో బదిలీ అయ్యే సమయానికి 450 మంది విద్యార్థులను తీసుకుపోయామని, ఇందుకు అందరి ఉపాధ్యాయుల సహకారం మూల కారణం అన్నారు.సన్మాన గ్రహీతలు గాయత్రి, స్వర్ణలత, ప్రసన్న, సులోచన, ఆంతోని రాజు, అలీఖాన్, ప్రభాకర్, సూర్యనారాయణ, చంద్రహాసన్ రెడ్డి, శ్రీధర్, జయరాములుతో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## కోసువారిపల్లెలో కోలాహలంగా వినాయక నిమజ్జనం



తంబళ్లపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె పంచాయతీలో శనివారం కోలాహలంగా వినాయక నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. పంచాయతీలోని సుమారు 15 గ్రామాల్లో వినాయక విగ్రహాలకు చివరి సారిగా మహిళలు పెద్దఎత్తున పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను ఊరేగింపుగా పంచాయతీ కేంద్రం కోసువారిపల్లెకు కోలాహలం మధ్య ప్రత్యేక వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించి అనంతరం కోసువారిపల్లె సమీపంలోని బయమ్మ చెరువులో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు. ఎప్పుడూ లేని విధంగా కోసువారిపల్లెలో కుల మతాలకతీతంగా హిందూ ముస్లిం సోదరులు పండగ ఘనంగా నిర్వహించు కోవడం హర్షనీయం.

## రైతులకు డ్రిప్ పరికరాలు పంపిణీ



ములకల చెరువు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

ములకల చెరువు మండలం వేపూరికోట పంచాయతీలో శనివారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో తంబళ్లపల్లె శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో సూక్ష్మ సేద్య పరికరాలను పెద్దయ్యగారిపల్లి మహిళా రైతు బి.అనురాధ, కేశవంరెడ్డి తదితరులకు ఎంపీటీసీ మార్కేరి శ్రీనివాసులురెడ్డి సర్పంచు చిన్న మేకల వెంకట రమణారెడ్డి, డి.శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శేషారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు బి.శంకర్‌రెడ్డి, బీఓడీ మెంబర్ పీవీ జయరాంరెడ్డిల చేతుల మీదుగా రైతులకు అందజేశారు. గ్లోబల్ డ్రిప్ కంపెనీ ప్రతినిధి డీలర్ ఎర్ర మదు, కృష్ణారెడ్డి మరియు కంపెనీ సిబ్బంది వై.రామకృష్ణ ఎప్పీవో, మల్లికార్జునరెడ్డి డీసీవో అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పీవీ సుబ్బిరెడ్డి, ఆర్.రామకృష్ణారెడ్డి, సుబ్బిరెడ్డి, రెడ్డప్పరెడ్డి, సీతిరెడ్డి మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## విజయ గణపతి ఆలయ లడ్డూ వేలం



కడప కార్పొరేషన్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

కడప నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో కొలువుదీరిన విజయ గణపతి ఆలయం లడ్డూను శనివారం కమిటీ సభ్యులు వేలం పాట ఏర్పాటు చేశారు. ఈ వేలం పాట నందు నగరపాలక సంస్థ ఏసీపీ నాగేంద్ర రూ.17వేలకు లడ్డూ వేలం పాటలో సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్స రం లాగానే ఈ ఏడాది కూడా విజయ గణపతి ఆలయ లడ్డూను వేలం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ వేలం పాట ద్వారా వచ్చిన మొత్తాన్ని ఆలయ అభివృద్ధి కోసం ఉపయోగిస్తామన్నారు. ఈ వేలం పాట కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ సీసీలు విశ్వనాథ్‌రెడ్డి, శివకుమార్, కాంట్రాక్టర్ కమిటీ సభ్యులు వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణ సింగ్, కమిటీ సభ్యులు రఘురామిరెడ్డి, నాగశివ, లూకరాజు, జగదీష్ కమిటీ సభ్యులు రామచంద్రయ్య పాల్గొన్నారు.

## నేత్రదానంపై వ్యాసరచన పోటీ



దువ్వూరు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పులా ల్లరెడ్డిపేట జిల్లా పరిషత్ హైస్కూలులో నేత్రదానం - ప్రాముఖ్యత అనే అంశంపై శనివారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డా.షమీరా, సురేష్‌లు మాట్లాడుతూ అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో కడప జిల్లా నేత్రదాన పక్షోత్స వాలు సెప్టెంబరు 8వ తేదీ వరకు జరుగుతాయని అందులో భాగంగా ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. నేత్రదానం వల్ల మరొకరికి కంటి చూపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు హెచ్ఎం అహల్యాబాయ్, కంటి సహాయకుడు చంద్రమౌళి, వైద్యసిబ్బంది శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## చెరువులను పరిశీలించిన అధికారులు



దువ్వూరు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

మండల పరిధిలోని దువ్వూరు, చింతకుంట చెరువులను మండల తహసీల్దారు రమాకుమారి, ఇరిగేషన్ ఏఈ నవీన్‌కుమార్‌లు శనివారం పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం చెరువు ఆక్రమణలకు గురై ఉంటే వాటి వివరాలు అందజేయాలని ఆదేశించారు. అందులో భాగంగా దువ్వూరు, చింతకుంట చెరువులను పరిశీలించారు. ప్రస్తుతం చెరువుల్లో నీరు ఉన్నందున కొలతలు వేసే అవకాశం లేదు. అందువల్ల నీరు తగ్గిన తరువాత చెరువులు ఆక్రమణకు గురయ్యాయా? ఎంత వరకు ఆక్రమించారు అనేది పరిశీలించి నివేదిక అందజేస్తామన్నారు. దువ్వూరు, చింతకుంట చెరువులను పలువురు ఆక్రమించుకున్నారని ప్రభుత్వ సర్వేతో అయినా ఆక్రమణలకు విముక్తి కలుగుతుందేమో చూడాలి. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలనారాయణస్వామి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## విజయవంతంగా మక్కా యాత్ర నిర్వహించాలి

### గురువులకు ముస్లిం సోదరుల ఘన సన్మానం



జమ్మలమడుగు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

జమ్మలమడుగు పట్టణంలోని జామియా మసీదులో గురువలను సయ్యద్ షా ఆసద్ పాషాఖాద్రీ మరియు కాజింబాషా ఖాద్రి, నాజింపాషాఖాద్రి, హాషీంపాషా ఖాద్రీలు ఆదివారం మక్కా యాత్రకు వెళ్తున్న సందర్భంగా జామియా మసీదు కమిటీ సభ్యులు మరియు ముస్లిం సోదరులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం జామియా మసీదు కమిటటీ సభ్యులు షేక్ షామీర్‌బాషా మాట్లాడుతూ జామియా మసీదు నుంచి గురువులు అసద్ పాషాఖాద్రి తమ ముగ్గురఉ కుమారులతో కలిసి పవిత్ర మక్కా యాత్రకు వెళ్లడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో గురువులు గౌస్‌పాషాఖాద్రి, యాసీన్ పాషాఖాద్రి, జావీద్ పాషాఖాద్రి, యాసిన్‌పాషా ఖాద్రి, జావీద్ పాషాఖాద్రి, నయీం పాషాఖాద్రి, ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మక్కా యాత్రకు వెళ్తున్న గురువులను ఆలింగనం చేసుకొని అభినందించారు. అనంతరం పూలదండలు, కాశ్మీర్ శాలువాలతో వారిని ఘనంగా సన్మానించారు.

## అన్నదమ్ముల మధ్య ఘర్షణ

కమలాపురం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

కమలాపురం మండలం చదిపిరాళ్ల గ్రామంలో శనివారం అన్నదమ్ముల కుటుంబాల మధ్య గేదె విషయంలో ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు చదిపిరాళ్ల గ్రామంలోని ఇరువురు అన్నదమ్ములు గేదె విషయంలో మచ్చుకత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో బాలగిరి శ్రీకాంత్, జయరాముడులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సబ్సిడీ మందులపై అధికారుల నిర్లక్ష్యం

జమ్మలమడుగు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఇవ్వాల్సి న సబ్సిడీ మందులను రెండు సంవత్స రాల నుంచి నిల్వ ఉంచి వ్యవసాయాధికారులు రైతులకు ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. జమ్మలమడుగు ఏపీఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు తప్పెట ఓబులేసు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి రైతులకు ఇవ్వాల్సి న సబినసడీ మందులు ఇవ్వాలని కోరారు.

## వంకను తలపిస్తున్న ప్రధాన రోడ్డు

### పెరుగుతున్న దోమల బెడద

### పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిదులు



నడిరోడ్డుపై నిలిచి ఉన్న డ్రైనేజీ,వర్షపు నీరు.

చింతకొమ్మదిన్నె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త

చినుకు పడితే అకాలనీ చిత్తడే వర్షం వచ్చిందంటే అకాలనీ ప్రజలు ఇంటినుండి కాలు బయట పెట్టలేని పరిస్థితిలో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని జిల్లా స్థాయి అధికారుల నుండి గ్రామ స్థాయి అధికారులను అదేశించడం జరుగుతుంది.కొద్ది పాటి వర్షం వచ్చినా, డ్రైనేజీ నీరుగాని, వర్షపు నీరు గాని నిల్వలు ఉండ కుండా అధికారులు, ప్రజా ప్రతినిదులు తక్షణమే చర్యలు తీసుకోవాలని చెప్పడం జరుగుతుంది. అయినప్పటికీ అధికారులు కాని ప్రజా ప్రతినిదులు గాని పట్టించు కోవడం లేదన్న విమర్శలు వెల్ల వెత్తుతున్నాయి. వివాల్లో కెళ్తే.. మండల పరిదిలోని ఇప్పపెంట పంచాయితీ బోడెద్దులపల్లి గ్రామంలోని ప్రదాన రోడ్డు,ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న రోడ్డు వంకను తలపించే విదంగా ఉన్నది. పిల్లలు పాఠశాలకు వెళ్లాలన్నా, వృద్దులు బయటకు వెల్లాలన్నా నడవలేని పరిస్థితి ఎర్పడింది. బోడెద్దులపల్లి, జమాల్‌పల్లి, కాంబల్లె, లక్ష్మినారాయణపురం, ఇప్పపెంట తదితర గ్రామాల ప్రజలు ఎవస్తువు కావాలన్నా బోడెద్దులపల్లి కాలనాకి రావాల్సిందే. బోడెద్దులల్లి ప్రధాన రోడ్డులో వ్యాపార సముదాయాలు అదింగా ఉన్నాయి.అందువల్ల ప్రజలు అ రోడ్డుపై అనేక మంది తమ అవసరాల కోసం ప్రతి రోజు వచ్చి వెళ్లుతుంటారు. గత రెండు రోజుల క్రితం కురిసిన కోద్దిపాటి వర్షానికే రోడ్లన్నీ వంకను తలపించే విదంగా ఉన్నాయి. అకాలనీలో డ్రైనీజీలు కాని రోడ్లు కాని వేయక పోవడంతో అకాలనీ డ్రైనీజీ,వర్షపు నీటితో నిండి ఉంది.దీంతో నిల్వఉన్న నీటిపై దోమలు వృద్ధి చెంది ప్రజలపై విళయతాండవం చేస్తున్నాయి.దీంతో కోంతమంది ప్రజలు సీజన్ వ్యాదుల బారిన పడక తప్పడం లేదు.నిల్వలు ఉన్న వర్షపు నీటి ప్రాంగణంలో బ్లీచింగ్ పౌడర్ గాని పాగింగ్ కాని చేసిన పాపాన పోలేదు. ఇప్పటి కైనా బోడెద్దులపల్లి గ్రామాన్ని ఉన్నతాదికారులు పరిశీలించి రోడ్లపైన ఉన్న మురుగు నీటిని తోలగించి సమస్యను పరిస్కరించాలని అ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## చిన్నంపల్లెలో విషజ్వరాలు

### - స్పందించిన వైద్యులు



ఓబులవారిపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

ఓబులవారిపల్లె మండలం చిన్నంపల్లెలో విష జ్వరాల భారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతో ఎంపీడీవో విజయారావు స్పందించి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి రోగులకు వైద్యం చేయించి జ్వరాల బారిన పడిన వారికి రక్తపరీక్షలు చేయించి అన్ని విధాలా అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వారం రోజుల పాటు సరిపోయే మందులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం గ్రామంలో అపరిశుభ్రత ఉన్న చోట బ్లీచింగ్ చల్లించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ధనమ్మ, వైద్యులు గురుమోహన్, వైద్య సిబ్బంది, పంచాయతీ అధికారులు తేజ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి పూజలు



స్వామి అలంకరణ,,అన్నదాన కార్యక్రమం

గోపవరం,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త;

మండలంలోని వల్లెరవారిపల్లెకు సమీపాన వెలసిన మహిమాణ్విత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి శనివారం అంగరంగ వైభవంగా ప్రత్యేక పూజలను, అభిషేకాలను నిర్వహించారు. శ్రీ స్వామివారి దర్శనార్దం అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారు,స్వామి వారి పూజలను దర్శించుకొన్న వారందరూ సుఖశాంతులతో ఉన్నారు. ప్రతి వారం జరిగే ఈ కార్యక్రమానికి చీడ పీడలకు గురైన అభాగ్యులు శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని వారి ఇబ్బందులను తొలగించుకొంటున్నారు. అదే విదంగా అలయ పూజారి శ్రీ పెంచలయ్య స్వామి భక్తి శ్రద్దలతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని భక్తులు తనివి తీరా వీక్షించి ఆనంద భరితులైతున్నారు. వీడియో ద్వారా కార్యక్రమాన్ని ఎమెల్సీ రమేష్ యాదవ్,నటుడు గౌతమ్ రాజు, ప్రముఖ సినీ నటులు, వ్యాపార వేత్తలు, రాజకియ నాయకులు తిలకించారు, కాగా కనమర్లపూటి సత్యనారాయణ,ధర్మపత్ని కోటేశ్వరమ్మ,కుమారులు కల్యాణ్ కుమార్, సాయిచరన్‌లు అన్నదానానికి అవసరమైన ఆర్దిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు,

## 6న మండల సర్వసభ్య సమావేశం



ఎంపిడిఓ హరినారాయణ

గోపవరం,సెప్టెంబర్ 3 ప్రభాతవార్త;

ఈ నెల 6న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తామని ఎంపిడిఓ హరినారాయణ,ఈఓపిఆర్‌డి షేక్ హసీనాలు సంయుక్తంగా తెలిపారు. స్దానిక ఎంపిడిఓ కార్యలయంలో శనివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ప్రజా ప్రతినిదులు, మండలంలోని అన్ని శాఖలకు సంబందించిన అధికారులు హాజరు కావాలన్నారు. ప్రతి అదికారి సంబందిత రికార్డులతో హాజరు కావాలన్నారు. కార్యక్రమానికి హాజరు కాని అధికారుల విషయాన్ని ఉన్నతా దికారుల దృష్టికి తీసుకెల్తామన్నారు,అదే విదంగా ప్రజలకు ఏవైనా సమస్యలుంటే ప్రజా ప్రతి నిదుల ద్వారా సభ దృష్టికి తీసుకు రావాలన్నారు,

## ఆకేపాటి పౌండేషన్‌ఉత్తమ ఉపాధ్యాయుడుగా హరినాథరెడ్డి ఎంపిక



ఒంటిమిట్ట సెప్టెంబర్3 ప్రభాతవార్త:

మండలం నుంచి ఆకేపాటి పౌండేషన్ ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఒంటిమిట్ట మండలంలోని పెద్దకొత్తపల్లి పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నల్లగొండు హరినాద్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆలాగే మండలం నుంచి మరో 8 మంది ఎంపికైనట్లు ఎంఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఖాదర్‌బాషా, విజయ మనోహరి, రెడ్డెయ్య, తిరుపలయ్య, చలమారెడ్డి, సునందదేవి, సాంబయ్య, త్రివిక్రమరెడ్డిలు ఆకేపాటి పౌండేషన్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. మండలం నుంచి 9 మంది ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## పోటాపోటీగా సాగిన లడ్డూ వేలం



ములకల చెరువు, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:

ములకల చెరువు మండలంలోని బురకాయలకోట మరియు బిల్లురివారిపల్లిలో ఎన్నడూ లేని విధంగా వినాయకుని సన్నిధిలో నిర్వాహకులు లడ్డూ వేలం నిర్వహించారు. ఈ లడ్డూ వేలంలో గ్రామస్థులు, యువకులు ఉత్సాహంగా హోరాహోరీగా పోటీ పడి వేలంలో పాల్గొన్నారు. ఇందులో బురకాయలకోటలో భానుప్రకాష్ రూ.33వేలకు దక్కించుకున్నారు. బిల్లురివారిపల్లెలో బిల్లూరి చిన్న ఉత్తంరెడ్డి రూ.52వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రవిశేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## వినాయక చవితి నిర్వహణలో గణేష్ యూత్ భేష్
### – ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో వినాయక చవితి పండుగ నిర్వహణలో గణేష్ యూత్ చేస్తున్న కార్యక్రమాలు బాగున్నాయని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారక నాథ్‌రెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ ప్రశంసించారు. శనివారం ఆమె గణేష్ యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వారు చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయక యూత్ ఇలాంటి సత్కార్యాలతో పాటు గతంలో కొండల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు సహాయక చర్యలు చేపట్టడం, మొక్కలు నాటడంతో పాటు పురాతన కళలు తోలుబొమ్మలాటలు, కోలాటాలు, చెక్క భజనలు, మ్యాజిక్ షోలు ఏర్పాటు మన సంస్కృతిని గుర్తుకు తెచ్చినట్లు చెప్పారు. ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొని భాగస్వాములు కావడం హర్షణీయమన్నారు. నేటి యువత వారిని ఆదర్శంగా తీసుకొని ప్రజాహిత కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు తమ వంతు సహకరించి తాము సైతం ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట పెద్దిరెడ్డి వేణుగోపాలరెడ్డి, యువ నేత కళ్యాణ్, గణేష్ యూత్ సభ్యులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయ వ్యవస్థను గాడిలో పెడతా
### – ఎంపీడీవో ఆనంద్‌కుమార్

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



తంబళ్లపల్లె మండలంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆశయ సాధన కోసం మండల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ నారాయణరెడ్డి, ప్రజా ప్రతినిధులు సహ కారంతో సచివాలయ వ్యవస్థను గాడిలో పెడతామని ఎంపీడీవో ఆనంద్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. శని వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారం రోజులుగా ప్రజా ప్రతినిధులతో కలిసి పలు సచివాలయాలను ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పని తీరును విశ్లేషించినట్లు చెప్పారు. సచివాలయ ఉద్యోగులు వంద శాతం హాజరై ఖచ్చితంగా యూనిఫాం పాటించి మారుమూల గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహనతో పాటు ప్రతి గడపకు చేరాలని ఆదేశించినట్లు చెప్పారు. అర్హులైన లబ్ధిదారులను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వారి పనులు చేసిపెట్టి ఎమ్మెల్యేకి మంచి పేరు తీసుకురావాలని సూచించినట్లు తెలిపారు. పరిసరాల శుభ్రత, మొక్కల పెంపకంలో చొరవ చూపాలన్నారు. నిర్మాణాలు పూర్తి కాని కార్యా లయాలు త్వరగా పూర్తి చేయాలని జగనన్న పక్కా గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని పురమాయించినట్లు చెప్పారు.

## పౌరసరఫరాల గిడ్డంగికి మోక్షం కల్పించండి
### – డీటీ హరిప్రసాద్

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలోని అసం పూర్తి పనులతో కొట్టుమిట్టాడు తున్న పౌరసరఫరాల శాఖ గిడ్డంగి పూర్తి చేయాలని డిప్యూటీ తహసీల్దారు హరిప్రసాద్ జిల్లా ఉన్నతాధికారులను కోరారు. పాత జూనియర్ కాలేజీ వెనక భాగంలో గత ఏడాది జిల్లా పౌరసరఫరాల శాఖ సుమారు రూ.90 లక్షలతో నిత్యావసర పరుకుల గిడ్డంగికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికి 50% పైగా పనులు జరిగాయి. వర్షాకాలం కావడంతో అద్దె గోడౌన్‌లో తంబళ్లపల్లె, పెద్దమండెం మండలాలకు బియ్యంతో పాటు నిత్యావసర సరుకుల నిల్వ, పంపిణీ కష్టసాధ్యం గా ఉంది. ఈ విషయమై ఈమధ్య జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీని వాసులు, టీఏ వినోద్‌లు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అద్దె భవ నంలో రెవెన్యూ అధికారులు, స్టోర్ డీలర్లు, హమాలీల ఇబ్బందులు గమ నించిన ఉన్నతాధికారులు ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పౌరసరఫరాల గిడ్డంగి త్వరగా పూర్తయితే తంబళ్లపల్లె నడిబొడ్డులో అంద రికీ సౌకర్యంగా ఉంటుందని స్థానిక, ప్రజా ప్రతినిధులు, ప్రజలు కోరుకుంటున్నారు.

## రామాలయ విగ్రహాల ఊరేగింపు

**తంబళ్లపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



తంబళ్లపల్లె మండల కేంద్రానికి సమీపంలోని అంబేద్కర్ కాలనీలో శని వారం శ్రీరాముల పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. స్థానిక స్టోర్ డీలర్ రామకృష్ణ సహకారం తో ఏర్పాటు చేసిన విగ్రహాలకు అర్చకులు దూప దీప నైవేద్యాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ, ఆకు పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీరాముల వారి విగ్రహాలను తంబళ్లపల్లె పురవీధుల్లో ప్రత్యేక వాయి ద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గుడి ప్రాంగణంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి తంబళ్లపల్లె, పరస తోపు పంచాయతీలోని పలువురు రామభక్తులు హాజరై భజన నిర్వహించారు.

## ప్రశాంతంగా ముగిసిన మండల సమావేశం

**కలికిరి, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**




గతంలో జరిగిన కలికిరి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎప్పుడు వాగ్వివాదాలు మధ్య జరిగేది. కాని శనివారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి వేంపల్లి నూర్జహాన్ ఆధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎటువంటి అలజడులు జరగకుండా జరిగింది. ఈసమావేశంలో ఎంపిపి నూర్జహాన్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు సహకరించాలని ఎంపిపి కోరారు. ఎంపిడిఓ గంగయ్య మాట్లాడుతూ పంచాయితీలలో ప్రజలు సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు మండల పరిషత్ ఎంపిపి దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరిస్తామని ఎంపిడిఓ పేర్కొన్నారు. వ్యవసాయ అధికారిణి మమతారెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ఖచ్చితంగా ఈపంట నమోదు చేసుకోవాలన్నారు. అదే విధంగా మండలంలో పిఎం కిసాన్ పథకంలో 5835మంది లబ్దిదారులు ఉండగా ఇప్పటికి 3271మంది మాత్రమే ఈకెవైసి చేసుకోవడం జరిగిందన్నారు. మిగిలిన 2614మంది ఈనెల 7వ తేదిలోపు ఈకేవైసి చేయించుకోవాలని వ్యవసాయ అధికారిణి సభ్యులకు సూచించారు. కలికిరి సర్పంచ్ ఆర్.ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని పంచాయితీల్లో చేపట్టే పనులు పంచాయితీల ఆమోదంతోనే చేపట్టాలని సర్పంచ్ సూచించారు. అదే విధంగా కలికిరి పంచాయితీ హౌసింగ్ లేవుట్లలో అక్రమాలు జరుగుతున్నాయని ఇదివరకే హౌసింగ్, రెవెన్యూ అధికారుల దృష్టికివాలని పేర్కొన్నారు. మేడికుర్తి వైద్యాధికారి చిన్నరెడ్డప్ప మాట్లాడుతూకరోనా నియంత్రణలో భాగంగా ఆరోగ్య కేంద్రాల్లో బూస్టర్‌డోస్ వేస్తున్నామని ప్రతి ఒక్కరూ వేసుకోవాలని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాలలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి వైద్యాధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలని వైద్యాధికారి కోరారు. ఏపిఎం దేవసేన మాట్లాడుతూ జగనన్న గృహాలు వేగవంతంగా జరిగేందుకు వెలుగు శాఖచే లబ్దిదారులకు రూ.35వేలు రుణాలు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికి ఎలాంటి ఘర్షణ వాతావరణం లేకుండా అజెండాలోని ప్రతి అంశం, విషయం ప్రశాంతంగా చర్చించడంతో సమావేశం ప్రశాంతంగా జరిగింది. ఈకార్యక్రమంలో జడ్పిటిసి పద్మజలోకవర్ధన్, తహశీల్దార్ భాగ్యలత, వైద్యాదికారి విష్ణుశివప్రసాద్, సిపిడిఓ భారతి, ఇరిగేషన్ ఏఈ దమరకం, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆధునిక సౌకర్యాలతో కేవిబి భవనాలు
### ఆర్డీఓ ఎంఎస్.మురళి

**మదనపల్లె, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



ఆధునిక సౌకర్యాలతో కేవిబి భవనాలు ఏర్పాటు చేసినట్లు ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. శనివారం పట్టణంలోని తాత్కాలిక కేవిబి భవనాలను పంచాయితీరాజ్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టి హాస్టల్‌లో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన కేవిబి భవనాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు 15రూములు కావాల్సి ఉండగా ప్రస్తుతం 12రూములను సిద్ధం చేశామన్నారు. బాలికలు, బాలురుకు వేర్వేరుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీరికి బాత్‌రూములు, నీటిసౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. పక్కాభవనాలు నిర్మించే వరకు తాత్కాలిక భవనాల్లో కేంద్ర విద్యాలయం నడపడం జరుగుతుందన్నారు.

## స్వీపర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి
### ఏఐటియుసి నాయకులు డిమాండ్

**మదనపల్లె, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



మున్సిపల్ పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటియుసి రాష్ట్ర సమితీ సభ్యులు సాంబశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో స్వీపర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల్లో మరుగుదొడ్లు, గదులు శుభ్రం చేస్తున్న స్వీపర్లకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించకపోవ డంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ప్రతినెల మొదటివారంలోనే వేతనాలు చెల్లించాలన్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వీపర్లు మాధవి, శివమ్మ, అమల, రామలక్ష్మి, గౌషియాబీ, విజయమ్మ, అలివేలమ్మ పాల్గొన్నారు.

## పెరిగిన టమోట ధరలు
### ఊరట చెందుతున్న రైతులు

**మదనపల్లె, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



టమోట ధరలు గత నాలుగు రోజులుగా పెరుగుతున్నాయి. శనివారం నీరుగట్టువారిపల్లెలోని టమోటా మార్కెట్ యార్డులో పదికేజీల టమోటా బాక్స్ రూ.360నుంచి 400ల వరకు ధరలు పలికాయి. కిలో టమోటా రూ.40ధర పలికింది. దిగుబడి తగ్గడం, బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ ఏర్పడడం వల్ల ధరలు పెరిగాయని వ్యాపా రస్తులు చెబుతున్నారు. మార్కెట్ యార్డుకు సాధారణంగా 500నుంచి 600 మెట్రిక్ టన్నులు టమోటాలు రోజూ వచ్చేవి. అలాంటిది 196మెట్రిక్ టన్నులు మాత్రమే మార్కెట్‌కు వచ్చాయి. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టాలు చవిచూసిన రైతులకు ధరలు పెరగడంతో కాస్త ఊరట చెందుతున్నారు. టమోటా వ్యాపార లావాదేవీల్లో మదనపల్లె మార్కెట్‌యార్డు రాష్ట్రంలోనే పేరుపొందింది. ఇక్కడ నుంచి టమోటాలు రాష్ట్రంలోని ప్రధాన నగరాలతో పాటు తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఒడిస్సా, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి.

## పక్కా ఇళ్ళ వేగవంతానికి చర్యలు: ఎంపిడిఓ

**మదనపల్లె, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



జగనన్న లేవుట్లలో పక్కా ఇండ్ల నిర్మాణ వేగవంతా నికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎంపిడిఓ తాజ్ మస్రూర్ తెలిపారు. శనివారం ఎంపిడిఓ కార్యాలయం లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రూరల్ మండల పరిధిలో అర్హులైన వారికి ప్రభుత్వం 3833 పక్కా గృహాలు మంజూరు చేయగా ఇప్పటివరకు 541ఇండ్లు పూర్తి చేశామన్నారు. 1839ఇండ్లు పునాదుల దశలో ఉన్నాయని, 540ఇండ్లు గోడల దశలో ఉన్నా యన్నారు. మెల్టింగ్ దశలో 390ఇండ్లు ఉండగా ఇంకా 26ఇండ్లు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేస్తా మన్నారు. లబ్దిదారులకు వెలుగు నుంచి రూ.35వేలు రుణసౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

**మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



కుటుంబ కలహాలతో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడి జిల్లా ఆసుపత్రిలో చేరారు. పట్టణంలోని నీరుగట్టు వారిపల్లె రామిరెడ్డి లేవుట్‌కు చెందిన ప్రభా కర్ భార్య దాక్షాయిని(30)లు కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబసభ్యులు గమనించి బాధితురాని జిల్లా ఆసుపత్రి తరించారు. చికిత్సలు నిర్వహించిన అనంతరం మెరుగైనవైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. రూరల్ మండలం కోటావారిపల్లెకు చెందన వెంకటరమణ కుమారుడు చలపతి(24) అదే గ్రామంలో ఓ యువతి ప్రేమలో పడ్డాడు. పెళ్ళికి నిరాకరించడంతో కుటుంబలోని పెద్దలకు విషయం తెలిపాడు. వారు ఇష్టపడకపోవంతో మనస్థాపంకు గురై పురుగుల మందు సేవించి ఆత్మ హత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్సలు పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## భార్య హత్య కేసులో భర్త అరెస్టు

**మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**

భార్యను హత్య చేసిన భర్తను ఒకటవ పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సిఐ కథనం మేరకు పట్టణంలోని నక్కలదిన్నె తాండాల్లో కాపురం ఉన్న దంపతులు శాంతమ్మ భర్త చేతిలో హత్యగావింపడిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ కేసులో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభిం చడంతో ఒకటవ పట్టణ పోలీసులకు స్వచ్ఛందంగా హతుడ వేణుగోపాల్ నాయక్ లొంగిపోయాడు. తాను భార్యను కావాలనే హత్య చేశానని పోలీసులు వద్ద అంగీకరించడంతో నిందితున్ని శనివారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## మహిళ కూలిపై దాడికి పాల్పడిన దంపతులు

**మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**

కూలిపనులకు రాలేదన్న నెపంతో ఓ దంపతులు మహిళను చితకబాదిన సంఘ టన శనివారం మొలకలచెరువు మండలంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు పాత మొలకలచెరువుకు చెందిన శంకర భార్య శాంతమ్మ(40)ను శనివారం ఉదయం పొరుగు గ్రామానికి చెందిన దంపతులు రెడ్డెప్ప, రచనలు శాంతమ్మను కూలిపనులకు రావాలని పిలిచారు. ఆమె సొంత పనినిమిత్తం రాలేనని తెలిపడంతో ఆగ్రహించిన దంపతులు శాంతమ్మను చితక బాదారు. ఈ దాడిలో గాయపడిన బాధితురాలును కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్సలు పొందుతోంది. ములకలచెరువు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బైక్‌ను ఢీ కొన్న కారు

**మదనపల్లెక్రైం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**

ద్విచక్రవాహనంలో సొంత పనులపై కర్నాటకాల్లోని రాయలపాడుకు వెలుతున్న దివ్యాంగుని బైక్‌ను వెనకనుంచి వేగంగా కారు ఢీ కొని మరో కాలు విరిగి తీవ్ర అస్వస్థలకు గురైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. బాధితుడు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలావున్నాయి. మదనపల్లె పట్టణం ఎస్‌బిఐ కాలనీ ఎక్స్‌టెన్షన్‌లో కాపురం ఉన్న మదన్(49) కర్నాటక రాయలపాడుకు తన సొంతపనిపై వెళ్ళి తిరుగు ప్రయాణంలో చీకిలుబైలు వద్ద బైక్‌ను కారు ఢీకొంది. ఈ ఘటనలో గాయపడిన బాధితున్ని 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నిందితులకు క్షమాబిక్ష రద్దు చేయాలి

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**



2002 గోద్రా అల్లర్లు సమయంలో ముస్లిం మహిళపైన సామూహిక అత్యాచారం చేసిన 11 మంది నిందితుల క్షమాబిక్ష రద్దు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న పేర్కొన్నారు. శనివారం లక్కిరెడ్డిపల్లెలోని వెంకటేశ్వర జూనియర్ కాలేజీ నడుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ముస్లిం మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన 11 మంది జైలు నుంచి విడుదలయ్యారని తక్షణమే క్షమాబిక్ష రద్దు చేయాలని తిరిగి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు. 17 సంవత్సరాల సుధీర్ఘ యాతన తరువాత న్యాయస్థానంలో ఆమెకు న్యాయం లభించింది. నేరస్థులందరినీ 2008లో ముంబైలోని ప్రత్యేక కోర్టు దోషులుగా నిర్ధారించి వారికి యావజ్జీవ జైలు శిక్ష వేసింది. ఈ శిక్షను బొంబాయి హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు కూడా సమర్థించాయి. కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలని, ప్రశాంతంగా నిర్భయంగా జీవించే హక్కును బిల్కిస్ బానుకు మహిళలందరికీ కూడా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు స్వరూప్, తేజ, పీడీఎఫ్ నాయకులు నాయుడు, చైతన్య రెడ్డి, కార్తీక్, లోహిత్, కాశీనాథ్, మనోజ్, చందు, భాను, పవన్, కుమార్, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

## చామంతి తోటల పరిశీలన..

**పెండ్లిమర్రి, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**



వైఎస్ఆర్ కడప జిల్లా పెండ్లిమర్రి మండలంలోని మొయిళ్లకాల్వ పంచాయతీ లో చామంతి తోటలను శనివారం కడప హార్టికల్చర్ అధికారి పి.సింధూరి పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ అనేక గ్రామాలలో చాఈమంతి సాగు చేస్తున్నారు. ఇటీవల కాలంలో చామంతిలో తెగుళ్ల వ్యాపించి మొక్కలు చనిపోవడం జరుగోతందని తెలిపారు. ఈ తెగులు అధికంగా ఉన్న కారణంగా కొన్ని ముఖ్యమైన విషయాలు తెలిపారు. తెగులు యొక్క ముఖ్య లక్షణాలు మొక్కలు పసుపు రంగులోకి మారి వాలిపోతాయి, తెగులు సోకిన మొక్కలు ఎదుగుదల లేక వాడిపోతాయి. మొగ్గలు ఏర్పడవు, వేర్లు కాండం రంగు మారతాయన్నారు. మొక్కలపై నుంచి ఎండుతూ వచ్చి చనిపోవడం జరుగుతుందన్నారు. ఈ తెగులును నివారించడానికి ముఖ్యంగా ఈ తెగులు నేల నుంచి ఆశిస్తుంది. కావునా నేలలో జీవ ఎరువులు అయిన ట్రైకోడెర్మా లాంటివి వేసుకోవాలి మొక్కలు నాటే ముందు నారును ఏదైనా శిలీంద్ర నాశినిలో ముంచి నీడలో ఆరబెట్టి తరువాత నాటు కున్నట్లయితే ఈ తెగులును నివారించ వచ్చన్నారు. ఉదజని సూచిక 6.5 నుంచి 7 ఉండేలా చూసుకోవాలని ఈ తెగులు సమర్థవంతంగా అరికట్టవచ్చన్నారు. సాఫ్ 2 గ్రాములు లీటరు నీటికి లేదా అమిస్టర్ టాప్ ఒక ఎమ్మెల్ లీటరు నీటికి లలేదా థైఫోనేట్ మేథాయిల్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవా లన్నారు. ఇలా మందులను రోజుకు ఒక సారి పిచికారి చేయడం వల్ల తెగుళ్ల నివారించవ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలు అందిస్తున్న వారికి సత్కారం..

**కడప వైద్య విభాగం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**

కడప నగరంలోని జనవికాస్ కార్యా లయం నందు జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి తాహిర్, యూనిస్ బాషాలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆడిటోరియం పక్కనున్న నూర్జహాన్ ఫంక్షన్ హాల్ నందు జనవికాస్ సేవా సమితి 11వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ప్రజలకు సామాజిక సేవలను అందిస్తున్న 300 మంది సేవా మూర్తులకు మదర్ థెరిసా పేరు మీదుగా సత్కరిస్తున్నామని ఆ సమితి ప్రినిధులు తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయడం కోసం జన వికాస్ సేవా సమితి సంస్థను ఆగస్టు నెల 26వ తేదీ మదర్ థెరిస్సా జయంతి రోజున 2012లో సంస్థను ప్రారంభించడం జరిగిందన్నారు. 10 సంవత్సరాల నుంచి దిగ్విజయంగా పూర్తయ్యి 11వ సంవత్సరంలో అడుగు పెడుతున్న శుభ సందర్భంగా ఇలాంటి కార్యక్రమం నిర్వ హించాలని మా రాష్ట్ర కమిటీ నిర్ణయించు కున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో జనవికాస్ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా కార్యవర్గం నగర ప్రముఖులు, అధికారులు తదితరులు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

## లక్ష్మిరెడ్డికి సత్కారం..

**కడప వైద్య విభాగం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



జిల్లా పరిషత్ మాజీ వైస్‌ఛైర్మన్ సీనియర్ టీడీపీ నాయకులు జి.లక్ష్మిరెడ్డి 28వ డివిజన్ నందు ఆయనకు మాజీ ఇన్‌ఛార్జి మైనార్టీ నాయకులు షామీర్ బాషాను ఎన్టీఆర్ బకాష్‌ను టీడీపీ అభి మానులను కలిశారు. లక్ష్మిరెడ్డితో పాటు కార్పొరేటర్ ఉమాదేవి, మన్‌మోహన్‌రెడ్డిలు కూడా పాల్గొన్నారు. అనంతరం షామీర్ లక్ష్మిరెడ్డిని పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ టీడీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## దర్గా మైదానాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలి
### – జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు

**కడప వైద్య విభాగం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



కడప నగరంలోని మచ్చంపేట నందు హజరత్ జలాలి రాఖీబ షావలి దర్గా మైదానంను కాపాడాలని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్ బాషా మరియు డివిజన్ వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దర్గా మైదానానికి కబ్జాదారుల కనుసన్నల్లో నుంచి కాపాడాలని ఆ మైదానం దర్గా కమిటీకే చెందాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక నాయకులతో కలిసి ఈ కబ్జాదారులు మసీదులు దర్గాలు దేవాలయాలను చూడకుండా అన్నీ కబ్జా చేస్తున్నారని వారికి తగిన బుద్ధి ప్రసా దించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషాతో పాటు దర్గా ముజావర్ సలీం బాషా, అభిమానులు, షబ్బీర్, ఆరీఫ్, కరీముల్లా, మస్తాన్, ఇమ్రాన్‌పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

**రామాపురం, సెప్టెంబర్ 3ప్రభాతవార్త:**

రామాపురం మండలం గువ్వల చెరువు సమీపంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలైనట్లు రామాపురం పోలీసు లు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కోలార్ నుండి కడప వైపు వెళ్తున్న ఎపి39 టిడి 0015 నెంబర్ గల గిరిధర్ బస్సు కాలకృత్యా ల నిమిత్తం గువ్వల చెరువు వద్ద బస్సు ఆపగా రోడ్డు దాటుతున్న కోలార్‌కు చెందిన శ్యామల (55) అను మహిళను కడప వైపు నుండి రాయచోటి వైపు పోతున్న టిఎన్39 సిఎఫ్ 9615 నెంబర్ గల లారీ శ్యామలను ఢీకొన్నది. ఈ సంఘటనలో శ్యామలకు తలకు తీవ్ర గాయాలు కావడంతో రామాపురం పోలీసులు గాయపడిన మహిళను 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాపురం పోలీసులు తెలిపారు.

## గరుడ వాహనంపై శ్రీరంగడి దర్శనం

**పులివెందుల, సెప్టెంబరు 3, ప్రభాతవార్త :**



పులివెందులలోని శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలుపూజోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ఆలయం లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి ఉత్సవ మూర్తులను అర్చకులు రాజేష్‌శర్మ నేతృత్వంలో గరుడ వాహనంపై కూర్చోబెట్టి భక్తాదులకు దర్శింపచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి అధ్యక్షుడు సుధీకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వినాయక నిమజ్జన ఉత్సవ వేడుకలు

**ప్రొద్దుటూరు సెప్టెంబర్ 3, ప్రభాతవార్త**



ప్రొద్దుటూరు పట్టణంలోని నేతాజీ నగర్ రెండో వీధిలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిమజ్జన వేడుకలు నేతాజీనగర్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సంద ర్భంగా ఉదయం ప్రత్యేక పూజలు నిర్వ హించి రాజుల గోపాల్ రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం వినాయక ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలు ముగ్గుల పోటీలలో విజేతలైన వారికి వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు సూలం లక్ష్మీదేవి సహకారంతో బహు మతులు అందజేశారు అనంతరం లడ్డు వేలంపాట లో 39 వేలకు మునిరెడ్డి కైవ సం చేసుకున్నారు ఈ సందర్భంగా వరసిద్ధి వినాయకుడిని ఊరేగింపుగా బాణ సంచా వేరులతో అంగరంగ వైభవంగా సంబరాలు జరుపుకున్నారు ఈ కార్య క్రమంలో దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతాజీ నగర్ యూత్ తో పాటు వీధి ప్రజలు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## హంతకులను తిరిగి జైలుకు పంపాలి

**కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



2002 గోద్రా అల్లర్లు సమయంలో బిల్కిస్ భాను అనే ముస్లిం మహిళపైన సామూహిక అత్యాచారం చేసిన 11 మంది నిందితులనఉ తక్షణమే క్షమాభిక్ష రద్దు చేసి వారిని తిరిగి జైల్‌కు పంపించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో కడప నగరంలోని ఐటీఐ సర్కిల్‌లో శనివారం నాడు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఒరుగంటి నాగేంద్రబాబు మాట్లా డుతూ బిల్కిస్ బాను సామూహిక అత్యాచారానికి గురైనప్పుడు ఆమె వయసు 21 సంవత్సరాలు. ఆమె అప్పుడు 5 నెలల గర్భవతి. నేరస్థులు పెద్ద బండరాయితో తన 3 సంవత్సరాల కుమార్తె సలేహ తల బద్దలుకొట్టి చంపడాన్ని కళ్లారా చూసిందని, తన కుటుంబంలోని 14 మందిని హత్య చేయడాన్ని కూడా ఆమె చూసింది. న్యాయం కోసం తన సుదీర్ఘమైన పోరాటాన్ని ప్రారంభించింది. తనకు జరిగిన అన్యాయానికి న్యాయం చేయాలని న్యాయ వ్యవస్థను ఆశ్రయించింది. 17 సంవత్సరాల సుదీర్ఘ యాతన తరువాత న్యాయస్థానంలో ఆమెకు న్యాయం లభించింది. నేరస్థులందరినీ 2008లో ముంబైలోని ప్రత్యేక కోర్టు దోషులుగా నిర్ధారించి వారికి యావజ్జీవ జైలు శిక్ష వేసింది. ఈ శిక్షను బొంబాయి హైకోర్టుతో పాటు సుప్రీంకోర్టు కూడా సమర్థించాయి. ఈ 11 మందిని సత్ప్రవర్తన పేరుతో 75 సంవత్సరాల అజాదికా అమృత్ మహోత్సవ్ సందర్భం గా కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం దేశాన్ని దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. నిందితులకు కోర్టు శిక్షను అమలు చేయాలని బిల్కిస్ భాను సుదీర్ఘంగా చేసిన పోరాటాన్ని కోర్టు ఇచ్చిన తతీర్పును గౌరవించాలని, ప్రశాంతంగా నిర్భయంగా జీవించే హక్కును బిల్కిస్ బానుకు మహిళలందరికీ కూడా కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర నాయకులు షేక్‌మస్తాన్, సాదక్, అబ్దుల్, రెహమాన్, ఉస్మాన్, కృష్ణారెడ్డి, లక్ష్మిరెడ్డి, తన్వీ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



లక్కిరెడ్డిపల్లె అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం రూ.12వేలు ఇవ్వాలని ఏఐటీ యూసీ జిల్లా కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీని వాసులు పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాల పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీపై చర్యలు తీసుకొని ప్రతి నెల కార్మికుడి అకౌంట్‌లో వారి వేతనం జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే గత మూడు నెలలుగా వారికి ఇవ్వాల్సిన వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న ఏజెన్సీలపై ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా వ్యవహరించి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. వివిధ కారణాలతో వారికి రావాల్సి న జీతంతో కూడా కోత విధిం చడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్య కార్మికులందరినీ ఆప్కోస్ చేర్చి కనీస వేతనాలు అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవి, రమణమ్మ, సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

**లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 3, ప్రభాతవార్త:**

లక్కిరెడ్డిపల్లెలోని అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి నుంచి 9వ తరగతి వరకు అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వరప్రసాద్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ బాలికలు ఇతరులు 5వ తరగతి నుంచి 9వ తరగతి సరాసరి సర్టిఫికెట్లు తీసుకువస్తే వెంటనే చేర్చుకుంటామని ఆయన తెలిపారు. అలాగే 10వ తరగతి పాసై ఇంటర్ బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో ఖాళీలు ఉన్నాయని సరాసరి చేర్చుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

## ప్రజల సంక్షేమమే తెదేపా ఆశయం..

**కడప వైద్య విభాగం, సెప్టెంబరు 3, ప్రభాతవార్త**



ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రయోజ నాలు తెదేపా ఆశయమని చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఎన్డీఏ భాగ స్వామిగా బీజేపీతో సంబంధాలు ఏర్పరచు కొని ఆదర్శంతమైన ప్రధాన మంత్రిగా దేశ ప్రజల మన్ననలను పొందిన వాజ్‌పేయి, అధ్వానీలు చంద్రబాబునాయుడు జాతీయ భావాలు గల నాయకుడిగా గుర్తించి ఎనలేని గౌరవాన్ని ఇచ్చేవారని తెదేపా ఎంపీలకు కేంద్ర మంత్రివర్గంలో స్థానం కల్పించడం లోక్ సభ స్పీకర్‌గా రాష్ట్రపతులుగా అంబద్కేర్‌కు భారతరత్న బిరుదు ప్రదానం చేయడం రాష్ట్రానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని మొదలగు ఎన్నో ప్రతిపాదనలను వాజ్‌పేయి ద్వారా సాదించుకున్న గొప్ప నాయకుడు చంద్రబాబు నాయుడు అని తెదేపా కడప జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు నాదెళ్ల దస్తగిరి తెదేపా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. సీఎం జగన్ మోదీ దగ్గర రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి మోదీని ఎదిరించే ధైర్యం లేక ప్రజలకు తతీరని అన్యాయం చేస్తున్నారని వారన్నారు. రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురి చేస్తూ అమరావతి రాజధానిని పూర్తిగా నిరోల్యాం చేస్తూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆపివేయడం ప్రజల సంక్షేమానికి కేటాయించిన నిధులను నవరత్నాలకు మళ్లించడం నిత్యావసర ధరలను పెంచడం పేద వారి కడుపు కొట్టడం చేస్తున్నారని ఇది ఆయన రాక్షస పాలనకు నిదర్శనమన్నారునీ కార్యక్రమంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, బీసీ సెల్ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి పాల్గొన్నారు.

## నీలి...నీలి ఆకాశం తెల్లటి మేఘాలతో దర్శనం

**పెద్దతిప్పసముద్రం, సెప్టెంబర్ 3 ప్రభాతవార్త:**



సృష్టిలో ప్రకృతి చాలా విచిత్రమైంది. ఎందుకంటే పగలు వెలుగు, రాత్రి చీకటి, ఎండా, వర్షం, గాలి ఇంకా ఎన్నో రకాలు గా వాతావరణంలో కనపడు తాయి. మండలంలో పది రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురవడంతో వాతా వరణంలో చల్లబడింది. ఆకాశంలోని మేఘాలు మబ్బులుగా అలుముకొన్న, శనివారం ఉదయం ఆకాశం నీలి రంగు ఉండడం అందులో తెల్లటి మేఘాలు మంచుకొండల్లా కనిపించడంతో ఈ అందమైన దృశ్యాన్ని ప్రభాతవార్త పిటిఎం ఎస్ఎం.రఫి ఫోటో క్లిక్‌మనిపించాడు.

